సాక్షి ప్రకాశం

గురువారం । 3 । అక్టోబర్ । 2024



చుట్టమల్లె చుట్టేస్తోంది..!

పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యం బెల్టుషాపులు విచ్చలవిడిగా సాగుతున్నాయి. 24 గంటలూ మద్యం అందుబాటులో ఉండటంతో కాపురాలు గుల్లవుతున్నాయి.

- 8లో..



మద్యం వద్దు..మంచి నీళ్లు కావాలి

మద్యం నూతన పాలసీని వ్యతిరేకిస్తూ మద్యం వద్దు..మంచినీళ్లు కావాలని అనే నినాదంతో కనిగిరిలో మహిళలు నిరసన తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36.5/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరు జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా శివప్రసాద్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ రేపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఈనెల 4న బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యాలయవర్గాలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఉదయం 9 గంటలకు చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తారు. ఉదయం 10 గంటలకు స్థానిక చర్చి సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 10.30 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పేర్నినాని, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తదితరులు హాజరవుతున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలి

దర్శి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా ఈ నెల 4వ తేదీ ఒంగోలు టౌన్ బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయంలో జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు, ప్రజలందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. స్థానిక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే మహాత్ముని ధ్యేయం

- ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి

ఒంగోలు: గ్రామ స్వరాజ్య స్థాపనే మహాత్మా గాంధీ ప్రధాన ధ్యేయమని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. గాంధీ జయంతి వేడుకల సందర్భంగా ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలమణి, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమ శేఖర తదితరులు మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వి.సి.ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అనేక త్యాగాలు చేసిన యోధునిగా గాంధీ గుర్తింపును పొందారన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దళితులపై పెరిగిన దాడులు



కేవీపీఎస్ పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దుర్మార్గ మతోన్మాద పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అట్లూరి రాఘవులు విమర్శించారు. నగరంలోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో పతాకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై దాడులు, హత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నా నేరస్తులను కాపాడేందుకు చట్టాలను మారుస్తుందని మండిపడ్డారు. దళితుల హక్కులను కాలరాస్తున్న ఎన్డీఏ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు కేవీపీఎస్ పతాకావిష్కరణల కార్యక్రమం కొనసాగుతుందని ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్, శ్మశాన స్థలాల జీఓ, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం, డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛన్‌లాంటివన్నీ కేవీపీఎస్ పోరాటాల ద్వారా సాధించుకున్నవే అని చెప్పారు. ఎన్ని సాధించుకున్నా దళితులపై దాడులను ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, నగర కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు, సయ్యద్ హుసేన్, రంగయ్య, జబ్బార్, టి.మహేష్, టి.దాసు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్య అందాలన్న లక్ష్యంతో అమలవుతున్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇంత వరకూ స్పష్టత రాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌పై బాధ్యతను మరిచి వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.359.73 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. విద్యార్థి సంఘాలు రోడ్డెక్కినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. ఉన్నత చదువులు గాల్లో దీపంలా మారాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్.. పత్తాలేదు..!



- కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత కరువు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- నోరు విప్పని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- గత ఐదేళ్లలో జిల్లాలో రూ.955.39 కోట్ల విడుదల
- 2019లో చంద్రబాబు బకాయిలు సైతం ఇచ్చిన గత ప్రభుత్వం
- ప్రస్తుతం విద్యాదీవెన, వసతి దీవెన నిధులు రూ.359.73 కోట్ల మేర బకాయి
- ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నోరు మెదపని ప్రభుత్వం

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

రాష్ట్రంలో గత ఐదేళ్ల పాటు నిశ్చింతంగా ఉన్న విద్యారంగం కూటమి ప్రభుత్వంలో ఒడిదుడుకులకు గురవుతోంది. మళ్లీ ఐదేళ్ల క్రితం నాటి కష్టాలను చవి చూడాల్సి వస్తుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్, పీజీ తదితర కోర్సుల్లో చేరేందుకు జూన్ నుంచి ఆగస్టు వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు సందడిగా ఉన్నాయి. కోర్సు పూర్తి చేసిన వారు ఆయా కళాశాలల నుంచి సర్టిఫికెట్‌తో బయటకు వెళ్లటం, లేదంటే పై తరగతులు వెళ్తారు. ఈ సమయంలో ఆయా కళాశాలల మొదటి టర్మ్ ఫీజు చెల్లించాలని కోరుతుంటారు. ఆర్థికంగా ఉన్న వారైతే వెంటనే ఫీజులు చెల్లిస్తారు. కానీ, పేద మధ్య తరగతి వర్గాలకు చెందిన తల్లిదండ్రులు వేలకు వేలు ఫీజు చెల్లించడం ఇబ్బందిగా మారుతోంది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పేరుతో విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ వచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకాలకు పేర్లు మార్చింది. కానీ అసలు వీటిని ఏవిధంగా అమలు చేస్తామనే విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు. ప్రతి ఏడాది జూన్ నెలలో చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనపై ఇప్పటి వరకు స్పష్టత కొరవడటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు మిడ్ పరీక్షలు పూర్తయినా సరే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాలేదు. సజావుగా జరుగుతున్న పథకాలకు పేర్లు మార్చడంలో ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయటంలో లేదని కూటమి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

చంద్రబాబు పెండింగ్‌ను క్లియర్ చేసిన జగన్ సర్కార్

2017-18, 2018-19 విద్యా సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019-20 విద్యా సంవత్సరంలో విడుదలయ్యాయి. అలాగే కుటుంబ వార్షిక ఆదాయాన్ని కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.లక్షగా నిర్ధారిస్తే, వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరాలనే సదుద్దేశంతో జగన్ ప్రభుత్వం రూ.2.50 లక్షలకు పెంచింది. ఈ నేపథ్యంలోనే వసతి దీవెన పథకం ద్వారా ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.23 వేలు ప్రకారం అందించింది.

ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ పాలనలో విడుదలైన మొత్తం

సంవత్సరం	విద్యాదీవెన విద్యార్థులు	విద్యాదీవెన తల్లులు	విడుదలైన మొత్తం
2019-20	84,680	-	2,12,34,99,271
2020-21	80,201	71,737	1,59,53,09,193
2021-22	55,646	49,635	1,44,25,41,681
2022-23	41,868	38,280	1,38,50,59,495
2023-24	47,422	42,797	36,44,29,751
మొత్తం	**3,09,817**	**2,02,449**	**6,91,08,39,391**

వసతి దీవెన ఇలా..

సంవత్సరం	వసతి దీవెన విద్యార్థులు	వసతి దీవెన తల్లులు	విడుదలైన మొత్తం
2019-20	88,949	-	87,46,72,500
2020-21	80,914	71,284	78,07,45,500
2021-22	53,953	48,430	52,04,70,000
2022-23	48,499	43,878	46,72,17,500
మొత్తం	**2,72,315**	**1,63,592**	**2,64,31,05,500**

నోరు విప్పని విద్యాశాఖ మంత్రి లోకేష్..

యువగళం పాదయాత్రలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హామీలు ఇచ్చిన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఇప్పటి వరకూ నోరు విప్పడంలేదని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఎన్నికల సందర్భంగా ఆగిపోయిన నిధులను మంజూరు చేసే విషయంలో ఇంత వరకూ పట్టించుకోక పోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజు పెంచి సాహసోపేత నిర్ణయం:

గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశ పెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేవి. కానీ కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్ 01) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఆయా కళాశాలల్లో చదువుతున్న సంబంధిత సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలను మినహాయించి మిగిలిన ఫీజు వారి తల్లిదండ్రులే చెల్లించాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని కూడా తొలగించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని నిర్ణయం తీసుకుని అమలు చేశారు. ఈ నేపథ్యంలోనే జగనన్న విద్యాదీవెన పేరుతో ఆయా విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రేడ్-1 కళాశాలల్లో అనేక మంది విద్యార్థులు ఇంజినీరింగ్ తదితర కోర్సులను ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తి చేసి కుటుంబాలకు ఆసరాగా నిలిచారు.

ఐదేళ్లలో రూ.955.39 కోట్లు విడుదల

ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ తదితర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.955.39 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఫీజుల్లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చేస్తున్న విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పలు ప్రైవేట్ కళాశాలలు బకాయి పడిన ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని తేల్చి చెబుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యాదీవెన ద్వారా 1,237,623 మంది విద్యార్థులకు వారి తల్లులు 1,14,532 మంది అకౌంట్‌లలో రూ.89,44,38,683, వసతి దీవెనకు 2,80,364 మంది విద్యార్థుల తల్లులు 2,51,348 మందికి రూ.2,70,28,67,500 చెల్లించాల్సి ఉంది.

యథేచ్ఛగా చుక్క.. ముక్క !

- దొడ్డిదారిన మద్యం..రాజమార్గంలో మాంసం విక్రయాలు
- మహాత్మా గాంధీ జయంతి రోజున డ్రైడేని పట్టించుకోని వ్యాపారులు
- చోద్యం చూసిన అధికారులు



ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్లో చికెన్ విక్రయిస్తున్న దుకాణం



ఒంగోలు పాత కూరగాయల మార్కెట్ వద్ద మద్యం నిషాలో రోడ్డుపైనే పడిపోయిన మందుబాబు

ఒంగోలు టౌన్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలు జోరుగా కొనసాగాయి. ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం లెక్కచేయకుండా వ్యాపారులు బరితెగించారు. రోజువారికంటే గాంధీ జయంతి రోజున మరింత ఎక్కువగా వ్యాపారం చేసినట్లు ఒక మద్యం వ్యాపారి చెప్పడం పరిస్థితికి అద్దం పడుతోంది. నగరంలోని అనేక బార్ అండ్ రెస్టారెంట్లు యథావిధిగా మద్యం విక్రయాలు సాగించాయి. నగరంలో ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయిస్తూనే ఉంది. రెస్టారెంట్ వెనక వీధిలో మద్యాన్ని నిలువ ఉంచిన వ్యాపారులు డబ్బులు చెల్లించిన వారికి వెంటనే తెచ్చి ఇస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో లారీ డ్రైవర్లు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మద్యం బాబులు అధిక ధరలకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, కొప్పోలు బ్రిడ్జి, కేశవరాజు కుంట, గోరంట్ల థియేటర్, కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్, త్రోవగుంట ఎస్సీ కాలనీ రోడ్డు, కర్నూలు బై పాస్, 60 అడుగుల రోడ్డు తదితర ప్రాంతాల్లో మద్యం విక్రయించారు. రూరల్ గ్రామాల్లో పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు జరిగినట్లు సమాచారం. మండలంలోని ఒక గ్రామంలో బుధవారం ఉదయం కొంతమంది మందుబాబులు గొడవపడ్డారు. ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న ఒక బెల్ట్ షాపులో మద్యం కోసం సిగపట్లు పట్టుకొని కొట్టుకున్నారని తెలుస్తోంది. ఇదే గ్రామంలో దేవాలయం వెనక మద్యం దుకాణంలో బహిరంగంగానే మద్యం విక్రయించినట్లు సమాచారం. నగరంలోని ఒక హాస్పిటల్ దగ్గర ఉన్న బంకులో మద్యం విక్రయించడం పలువురి కంటపడింది. గాంధీ జయంతి రోజున డ్రైడే ఉండంతో ఒకరోజు ముందుగానే బెల్ట్ షాపులకు మద్యం తరలించి అధిక ధరలకు విక్రయించారు. రూ.880 విలువైన మాన్షన్ హౌస్ ను రూ.1300, రూ.150 ఖరీదు చేసే రాయల్ ప్యాలెస్ క్వార్టర్ రూ.250 నుంచి రూ.400 కు, రూ.220 ఖరీదు చేసే రాయల్ గ్రీన్ క్వార్టర్ రూ.350 నుంచి రూ.400 విక్రయించినట్లు సమాచారం.

తెరిచే ఉంచిన చికెన్ దుకాణాలు..

ఇక మద్యం దుకాణాలతో పోటీ పడుతూ చికెన్ దుకాణాల నిర్వాహకులు వ్యాపారాలు నిర్వహించారు. ఏమాత్రం బెరుకు లేకుండా పబ్లిక్‌గా దుకాణాలు తెరిచి మాంసం విక్రయాలు జరిపారు. నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద చికెన్ దుకాణాలు రాత్రి 10 గంటల వరకు తమ వ్యాపారాలు సాగించాయి. ఎవరికి ఇవ్వాల్సింది వాళ్లకు ఇచ్చాం, మమ్మల్ని దుకాణాలు మూయమని చెప్పేవాడే లేడని ఒక చికెన్ దుకాణం వ్యాపారి చెప్పడం గమనార్హం. నగరంలోని అన్నీ సెంటర్లలో చికెన్ పకోడాలు, బిర్యానీ దుకాణాలు కూడా తెరచి ఉంచి వ్యాపారాలు చేసుకోవడం కనిపించింది. అధికారులు, ఎక్సైజ్ అధికారులు ఏమయ్యారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

గాంధీజీకి ఘన నివాళి



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట

ఒంగోలు సబర్బన్: జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్భంగా ఒంగోలు గాంధీ రోడ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ, హౌసింగ్ అండ్ అర్బన్ వ్యవహారాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న చావిడి భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇందుకు అవసరమైన నిధులను ఎంపీ లాడ్స్ నుంచి తాను ఇస్తానని ప్రకటించారు. వచ్చే ఏడాది అక్టోబరు 2 నాటికి భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం చావిడి భవనాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ జీ.సుజాత, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఆర్డీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ వాసు, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్

- జిల్లా వ్యాప్తంగా నాలుగు సెంటర్ల కేటాయింపు
- హాజరుకానున్న 11,566 మంది అభ్యర్థులు
- రోజుకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు
- 100 మీటర్ల పరిధిలో జెరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేత
- ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్



టెట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

3 నుంచి 21వ తేదీ వరకు టెట్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలు

పరీక్ష కేంద్రం	ఉదయం అభ్యర్థుల కేటాయింపు	సాయంత్రం అభ్యర్థులు కేటాయింపు
కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్	606	531
డాక్టర్ శామ్యూల్ జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ	650	390
నేషనల్ కౌన్సిల్‌ఫర్ ది చర్చి సోషల్ యాక్షన్ ఇండియా	3120	3244
బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్	1515	1510
మొత్తం	**5891**	**5675**

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) గురువారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 11,566 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతుండడంతో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ కావడంతో పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఇంటర్నెట్ కేంద్రాలు, జెరాక్స్ సెంటర్ల మూసివేత, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

నాలుగు సెంటర్లు ఇవే:

ఈ పరీక్షలను ప్రతిరోజు రెండు షిఫ్టుల్లో నిర్వహించనున్నారు. ఉదయం షిఫ్ట 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో షిఫ్ట మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులోని కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్), మార్కాపురం మండలం దరిమడుగులోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, స్థానిక మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి సోషల్ యాక్షన్ ఇండియా కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. తొలిరోజైన 3వ తేదీ నాలుగు సెంటర్లలో 911 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈనెల 11, 12 తేదీల్లో పండుగ సెలవులు మినహా మిగిలిన అన్ని రోజుల్లో పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టారు.

పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు:

పరీక్షల నిర్వహణ సందర్భంగా పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జెరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఏఎన్ఎంను అందుబాటులో ఉంచడం, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా సిద్ధంగా ఉంచేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేలా అవసరమైన బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు నలుగురు డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, టెట్ గ్రీవెన్స్/హెల్ప్‌లైన్ సెంటర్లు 4 ఏర్పాటు చేశారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేద్దాం

ఒంగోలు:



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్, పక్కన నగర అధ్యక్షుడు కటారి శంకర్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టనున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు కృషిచేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూచేపల్లి కుటుంబం అంటేనే సామాజిక సేవకు, దాతృత్వానికి మారుపేరు అన్నారు.

దర్శి శాసనసభ్యునిగానే కాకుండా ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా యువకుడైన బూచేపల్లి శివప్రసాదరెడ్డిని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడం, ఆయన ఈనెల 4న బాధ్యతలు చేపట్టేందుకు వస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో మమేకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకుగాను నియోజకవర్గంలోని ప్రతి ముఖ్య నాయకుడు తమ వంతు బాధ్యతగా తీసుకుని సమాచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల దృష్టికి తీసుకువెళ్లి వారంతా ఈ ఉత్సవంలో భాగస్వామ్యమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు స్థానిక చర్చిసెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని, అనంతరం 10.30 గంటలకు పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారన్నారు.

ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన అంశాలపై సమీక్షించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, వెన్నపూస కుమారి వెంకటేశ్వర రెడ్డి, గంగవరపు ప్రవీణ్‌కుమార్, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ, మాజీ జెడ్పీటీసీ మట్టె రాఘవ, రాయపాటి అంకయ్య, నరాల రమణారెడ్డి, వీఆర్‌సీ రెడ్డి, షేక్ మీరావలి, నాగూర్, ఉన్నం జనార్దన్‌రావు, తాత నరసింహ గౌడ్, వాకా కృష్ణారెడ్డి, గుత్తికొండ నారపరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలి


మాట్లాడుతున్న యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు

ఒంగోలు:

పీఆర్‌సీ కమిటీని వెంటనే ప్రభుత్వం నియమించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లా శాఖ విస్తృత కార్యదర్శివర్గ సమావేశం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి .వీరాంజనేయులు మాట్లాడుతూ పని సర్దుబాటు ప్రక్రియలోని గ్రీవెన్స్‌ను వెంటనే పరిష్కరించాలని, ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేసి ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ రవి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేశారే తప్ప ఒక్క సమస్య పరిష్కరించినందున దశల వారీగా పోరాటానికి పిలుపునివ్వగా ఈ పోరాటాన్ని మున్సిపల్ ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని తక్షణమే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం అక్రమ బదిలీలకు తెర లేపుతుందని, దీన్ని ప్రభుత్వం ఆపాలన్నారు. సహ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ సీపీఎస్‌ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో ప్రమోషన్ ప్రక్రియలు కొనసాగించాలని కోరారు కోశాధికారి ఎస్.చిన్నస్వామి సంఘ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లా ఆఫీస్ బెరర్స్, రాష్ట్ర కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.



చుట్టమల్లే.. చుట్టేస్తోంది!

పల్లెసీమలను మత్తులో బిగించేస్తున్న 'బెల్ట్'

''బాధలు మరిచిపోవాలంటే రోజూ సాయంత్రం ఓ పెగ్గేయాలి. మన వాళ్లకు పెగ్గేస్తే సరిపోదు. ఫుల్ బాటిల్ లేపేయాల్సిందే''

''ఈమధ్య అందరూ అయ్యప్ప మాలలు వేస్తున్నారు. దీనివల్ల రాష్ట్రానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయం పడిపోతోంది''

ఇవి చంద్రబాబు నోటి నుంచి గతంలో రాలిన ఆణిముత్యాలు.

- టీడీపీ కూటమి గద్దెనెక్కిన తర్వాత పల్లెల్లో ఏరులైపారుతున్న మద్యం
- బెల్టుషాపుల నిర్వహణలో టీడీపీ నేతలదే కీలక పాత్ర
- కొన్ని గ్రామాల్లో 24 గంటలూ అందుబాటులో..

2014 ఎన్నికల వేళ రాష్ట్రంలో మద్య నిషేధం అమలు చేస్తామని ప్రకటించిన చంద్రబాబునాయుడు.. 2019లో ఓటమి తర్వాత మంచి మద్యం ఇవ్వడం లేదన్న ఓ అబద్ధాన్ని భుజానికెత్తుకున్న సంగతి తెలిసిందే. అధికారంలోకి రాగానే మద్యం ధరలు తగ్గిస్తామన్న ప్రచారాన్ని హోరెత్తించారు. గడిచిన పదేళ్ల వ్యవధిలో మద్యంపై చంద్రబాబు నాలుక మడతేయడమే కాకుండా పల్లెలను నిషా మైకంలోకి నెట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన దరిమిలా గ్రామాల్లో మద్యం భూతం మళ్లీ జడలు విప్పింది. పల్లెల్లో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపుల్లో రోజూ 24 గంటలూ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. గడిచిన మూడు నెలలుగా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి నేరుగా గ్రామాలకే మద్యం సీసాలు కేసులకు కేసులు తరలిపోతున్నాయి. అడపాదడపా పోలీసుల దాడుల్లో అక్రమ మద్యాన్ని సీజ్ చేస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదు. గ్రామాల్లో బెల్ట్ షాపుల దందా సాగిస్తోంది టీడీపీ కూటమి నేతలు కావడంతో దాడులు చేసేందుకు పోలీసు అధికారులు కూడా వెనకడుగు వేస్తున్నారు. కోరి తలనొప్పి తెచ్చుకోవడం ఎందుకన్న ఆలోచనలో ఖాకీలు ఉన్నట్లు తెలుస్తోంది.

తర్లుపాడు:

పశ్చిమ ప్రకాశంలోని పల్లెలను ఓ వైపు బెల్ట్ షాపులు, మరో వైపు నాటు సారా చుట్టేశాయి. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజక వర్గాల్లోని పలు గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపడంతోపాటు పరివర్తన కార్యక్రమాలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత మంచి నీరు దొరకని గ్రామాలు ఉన్నాయి కానీ, మద్యం దొరకని గ్రామాలు మాత్రం మచ్చుకు ఒక్కటి కూడా లేదనడంలో అతిశయోక్తి లేదు. తర్లుపాడు, కొనకనమిట్ల, కంభం, బేస్తవారపేట, అర్ధవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, కొమరోలు, పెద్దారవీడు, పొదిలి పట్టణాల్లోని ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యం విక్రయదారులు గ్రామాల్లో బెల్ట్ షాపులకు మద్యం బాటిళ్లను తరలిస్తున్నారు. ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై అదనంగా 50 నుంచి 100 రూపాయలు తీసుకుని విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. మార్కాపురం పట్టణంలో అయితే బాటిల్‌పై 100 నుంచి 150 రూపాయల వరకు అదనంగా గుంజుతున్నారు.

కుటుంబాలు ఆగమాగం

తెల్లవారుజాము మొదలుకుని అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో పలు గ్రామాల్లో మందుబాబులు ఘర్షణకు దిగడమే కాక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. తర్లుపాడు మండలంలోని ఓ గ్రామంలో మహిళపై ఇటీవల మద్యం మత్తులో ఓ ప్రబుద్ధుడు అఘాయిత్యానికి యత్నించాడు. అంతటితో ఆగక భర్తపై దాడికి పాల్పడ్డాడు. అవమాన భారంతో ఆ కుటుంబం ఊరు విడిచి పెట్టి వెళ్లింది. గత నెల 9వ తేదీన సంతనూతలపాడు మండలం తక్కెళ్లపాడుకు చెందిన యాచేపల్లి సురేష్(35) మద్యం మత్తులో ఒంగోలులోని రంగారాయుడు చెరువులో పడి ప్రాణాలు విడిచాడు. గత నెల 19న కురిచేడులో ఓ మందు బాబు నిషా నెత్తికెక్కి ఏకంగా సాగర్ కాలువలో దూకేయగా సమీపంలోనే ఉన్న పంక్చర్ షాప్ యువకుడు ప్రాణాలకు తెగించి కాపాడాడు. ఇలాంటి ఘటనలు జిల్లాలో నిత్యకృత్యమయ్యాయి. అంతేకాక భార్యభర్తల మధ్య ఘర్షణలు తలెత్తి పంచాయితీలు పోలీస్ స్టేషన్లకు చేరుతున్నాయి. యువత మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మద్యం మత్తులో కొందరు సైకోలుగా ప్రవర్తిస్తున్నారు. పూటుగా తాగిన తర్వాత మద్యం బాటిళ్లను రోడ్లపైనే పగలగొట్టి రాక్షసానందం పొందుతున్నారు.



తర్లుపాడు పశువుల ఆసుపత్రి ఆవరణలో, తర్లుపాడు జడ్పీ పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు

మహాత్మా మన్నించు.. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు


పెద్దారవీడులో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్సై

బుధవారం మహాత్మా గాంధీ జయంతి. మాంసం, మద్యం విక్రయాలు పూర్తిగా నిషిద్ధం. అయినప్పటికీ పల్లెల్లోని బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగాయి. పట్టణాల్లో ఉండే మందుబాబులు సైతం సమీప పల్లెల్లో బెల్ట్ షాపులకు వెళ్లి మద్యం కొనుగోలు చేశారు. మండల కేంద్రమైన పామూరులోని కేబీ థియేటర్ సమీపంలో బుధవారం ఓ యువకుడు మద్యం ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అలాగే కురిచేడు పట్టణంలోని వినుకొండ రోడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలోని ఓ కూల్ డ్రింక్ షాపులో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. మద్యాన్ని సీజ్ చేసి నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. గత నెలలో పెద్దారవీడు మండలం మద్దలకట్ట వద్ద ఓ వ్యక్తి నుంచి 35 మద్యం సీసాలు, గత నెల 16న రాచర్ల మండలం రాచర్ల ఫాం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వా ర్టర్లు, గత ఆదివారం అర్ధవీడు మండలంలోని గన్నేపల్లిలో ఒకరిని అరెస్టుచేసి 100 క్వార్టర్ సీసాలు, అదే రోజున కంభం మండలంలోని చిన్న కంభంలో ఓ బెల్టుషాపులో 40 క్వార్టర్ సీసాలు, 3 ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది అనేందుకు ఈ ఘటనలే నిదర్శనం.

అంతా టీడీపీ సానుభూతిపరులే..

డివిజన్ కేంద్రమైన మార్కాపురంలోని కాలేజీ రోడ్డులో ఉన్న ఒక మద్యం షాపు నుంచి రోజూ ఉదయం 6 గంటలకు ఆటోల ద్వారా లిక్కర్‌ను మార్కాపురం రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాలకు పంపుతున్నారు. బెల్టు షాపులను టీడీపీ నేతలే గ్రామాల్లో వేలం పాడుకుని నిర్వహిస్తున్నారు. ఇందుకుగానూ టీడీపీ కార్యక్రమాలు ఏవైనా గ్రామాల్లో జరిగితే ఆ ఖర్చంతా బెల్టుషాపుల నిర్వాహకులదేనన్న ఒప్పందం మీద అమ్మకాలు సాగుతున్నాయి. గత ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులకు బెల్టుషాపుల నిర్వహణ బాధ్యత దక్కింది. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. పైగా మందుబాబులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మద్యం సేవించేందుకు అడ్డాగా మార్చుకుంటున్నారు. తెల్లవారేసరికి తాగిపడేసిన మందు సీసాలు, వాటర్ బాటిల్‌లు, సిగరెట్ ముక్కలు దర్శనమిస్తుండటంతో అధికారులు, ఉపాధ్యాయులు నోటికి పని చెప్పి ఆవేశాన్ని చల్లార్చుకుంటున్నారు.

పీఆర్సీ ఊసేది.. ఓపీఎస్ సంగతేంది?

- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి


మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

ఒంగోలు: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునారెడ్డి అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా తృతీయకార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ పీఎఫ్, ఏపీ జీఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లుల చెల్లింపులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని ఖండించారు. 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ జీతాల నుంచి ప్రతి నెలా కొంత మినహాయించి, వారి ఖాతాల్లో పొదుపు చేసుకున్న సొమ్మును కూడా నెలల తరబడి చెల్లించకుండా, ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. స్పందించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం బాధాకరమన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రమణారెడ్డి, బి.వెంగళరెడ్డి, చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిల విషయంలో సవతితల్లి ప్రేమ కనపరుస్తున్నారన్నారు. వెంటనే సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. సకాలంలో డబ్బులు అందక వివాహాలు వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పదవీ విరమణ తరువాత అర్ధవేతన సెలవుల నగదును చెల్లించకపోవడం అన్యాయమన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను రకరకాల కారణాలతో పెండెంగ్‌లో పెట్టడం సరికాదన్నారు. 12వ పీఆర్సీ అమలులో జాప్యం కారణంగా వెంటనే 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. జీఓ నం.117ను రద్దు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఏ ప్రత్యామ్నాయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఎంటీఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ చివరిలోగా పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే ఉద్యమ కార్యాచరణకు పిలుపునిస్తామన్నారు. ఎస్టీయూ కేవలం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలోనే కాకుండా సామాజిక సేవ, మోడల్ టెట్, డీఎస్సీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి జి.నరసింహారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి డి.నాగయ్య, జిల్లాకార్యవర్గ సభ్యులు మౌలాలి, సిద్దిక్, కోటేశ్వరరావు, నబీఖాన్, రామచంద్రారెడ్డి, కోటాచారి, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి, మాల్యాద్రి, గాలెయ్య, రంగారావు పాల్గొన్నారు.

మద్యం వద్దు.. మంచినీళ్లు కావాలి

- ఐద్వా ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన


కనిగిరిలో మద్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న మహిళలు

కనిగిరి రూరల్: మద్యం నూతన పాలసీని వ్యతిరేకిస్తూ.. మద్యం వద్దు.. మంచి నీళ్లు కావాలి అనే నినాదంతో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకురాలు బషీరా మాట్లాడుతూ మద్యం నూతన పాలసీతో ప్రజలు నాశనం అవుతారన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై బాకా ఊది అధికారంలోకి వచ్చిన చంద్రబాబు .. 100 రోజులు దాటినా వాటి అమలుపై దృష్టి సారించక పోవడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. నిత్యవసర ధరలు నింగినంటాయని, సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనతో బతికే స్థితిలో లేరని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు శాంత కుమారి, రత్తమ్మ, ఎలీశమ్మ, వెంకటమ్మ, లాల్‌బీ, రమణమ్మ, ఆదిలక్ష్మీ, సీఐటీయూ నాయకురాలు పీసీ కేశవరావు, నరేంద్ర, ఏడుకొండలు, పిచ్చయ్య, టోపి వలి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల్లో పరివర్తనతోనే స్వయం అభివృద్ధి


మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: జైలులోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఖైదీలు స్వయం అభివృద్ధి వైపు అడుగులు వేయాలని జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ సూచించారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా జైలులో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఖైదీలకు ఆర్థిక సాధికారిత కల్పించడమే లక్ష్యంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏదో ఒక రంగంలో రాణించేందుకు ఖైదీలు ప్రయత్నించాలని సూచించారు. జైలులోని గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలు సమకూర్చేందుకు కృషి చేస్తామన్నారు. పేద ఖైదీలకు ఉచిత న్యాయసాయం అందిస్తామని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.దీనా తెలిపారు. మానసిక ఆనందం పొందడం ద్వారా ఎటువంటి తప్పులు చేయరని, కనుక ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవితాన్ని గడిపేందుకు ప్రయత్నించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి సూచించారు. జైలు జీవితం అనుభవించన తరువాత తిరిగి నేరాలు చేయకుండా మానసిక పరివర్తన పొందాలని అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు హితబోధ చేశారు. తొలుత జిల్లా జైలు సూపరెండెంట్ పి.వరుణారెడ్డి జైలులో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సదుపాయాలను వివరించారు. నగరంలోని వివిధ విద్యా సంస్థల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఖైదీలను అలరించారు.

నమో బాపూ..




మహాత్ముడి జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

లక్షణంగా ఉన్న బిడ్డను రూ.లక్ష కోసం వేధించారు

- రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంధ్యారాణి తల్లి చిట్టెమ్మ ఆరోపణ


సంధ్యారాణి(ఫైల్)

ఒంగోలు టౌన్: ''పెళ్లి సమయంలో 15 సెంట్ల పొలం, 20 వేల రుపాయల డబ్బు ఇచ్చాం. అయినా సరే ఇంకా డబ్బు తెమ్మంటూ అల్లుడు దుర్గా ప్రసాద్, అతని అమ్మమ్మ వెంకాయమ్మ, చిన్నమ్మ శివమ్మ వేధించారు. అది తట్టుకోలేకే నా కూతురు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది'' అని ఆత్మహత్యకు పాల్పడిన సంధ్యారాణి(20) తల్లి చిట్టెమ్మ బోరున విలపించింది. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఒంగోలు నగరంలోని జకరయ్య ఆసుపత్రి ప్రాంతానికి చెందిన సంధ్యారాణి ఉరఫ్ శృతి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సమాచారం తెలిసిన మృతురాలి కుటుంబ సభ్యులు బుధవరాం ఒంగోలు చేరుకున్నారు. మృతురాలి తల్లి చిట్టెమ్మ కథనం ప్రకారం.. మంగళగిరి మండంలోని చినకాకానికి చెందిన కటూరు చిట్టెమ్మ భర్త మల్లికార్జున నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. వారికి ఒక అబ్బాయి, కూతురు సంధ్యారాణి ఉన్నారు. భర్త లేకపోవడంతో వంట పనులు చేస్తూ ఆమె కుటుంబాన్ని పోషించేది. 2022లో కూతురు సంధ్యారాణిని ఒంగోలుకు చెందిన దుర్గాప్రసాద్‌కు ఇచ్చి పెళ్లి చేసింది. అతడు జులాయిగా తిరుగుతుండటంతో కుటుంబ పోషణ నిమిత్తం సంధ్యారాణి వంట పనులకు వెళ్లసాగింది. ఆమె సంపాదించిన డబ్బును కూడా భర్త దుర్గా ప్రసాద్ తాగి తగలేస్తున్నాడు. ఈ క్రమంలో దుర్గా ప్రసాద్ దగ్గరి బంధువు ఒకరితో అక్రమ సంబంధం కలిగి ఉండటాన్ని సంధ్యారాణి గమనించింది. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ తలెత్తుతోంది. ఈ క్రమంలోనే డబ్బు తీసుకు రమ్మంటూ భార్యను వేధించసాగాడు. దాంతో చిట్టెమ్మ ఒకసారి రూ.50 వేలు, మరోసారి రూ.20 వేలు ఇచ్చి పంపించింది. అయినప్పటకీ దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులు సంతృప్తి పడలేదు. మరో రూ.లక్ష తెమ్మంటూ వేధించసాగారు. ఈ విషయాన్ని సంధ్యారాణి తన తల్లికి చెప్పి బాధపడింది. అత్తింటి వేధింపులను భరించలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ కాలువలో మృతదేహం

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ ప్రధాన కాలువలో గుర్తుతెలియని యువకుని మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బుధవారం రాత్రి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసుంటుందని, నల్లరంగు ప్యాంట్, స్కై బ్లూ కలర్ చొక్కా ధరించి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ బసవరాజు తెలిపారు.

112 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దారవీడు: మండల పరిధిలో దేవరాజుగట్టు ఫ్లై ఓవర్ బిడ్జి సమీపంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ట్రాలీ ఆటో వాహనాన్ని జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. విజిలెన్సు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ కులశేఖర్ ఆదేశాల మేరకు దేవరాజుగట్టు సమీపంలో ట్రాలీ ఆటోను తనిఖీ చేసి డ్రైవర్లు జగన్నాథం, శివలను అధీనంలో తీసుకొని విచారించారు. తోకపల్లి గ్రామం సమీపంలో రెండు వేరు వేరు వాహనాల్లో బియ్యం బస్తాలను లోడు చేశారు. ఒక వాహనంలో 50 బస్తాలు, మరో వాహనాంలో 62 బస్తాలు లోడి చేసిన అనంతరం అక్కడి నుంచి ఒక వాహనం కంభం వైపు, మరో వాహనం త్రిపురాంతకం వైపు బయలుదేరాయి. కంభం వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉండటంతో 112 బస్తాల బియ్యంతో పాటు ట్రాలీ ఆటోను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం సేకరించి రవాణాకు పాల్పడిన వ్యక్తులపై పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, ఈడీటీ తిరుపతిరెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు


బాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి ఈనెల 12 వ తేదీ శనివారం వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజు వేదపండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తారు. గురువారం అమ్మవారికి అభిషేకం, కాలపూజ, బాలభోగం, గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, పంచగవ్యప్రాసన, అఖండస్థాపన, మండపారాధన, అష్టదిక్పాలకుల పూజ, సప్తశతీ పారాయణం, చండీహోమం నిర్వహించనున్నారు. నిత్యం గోపూజ, ఉభయదాతల పూజలు, బాలపూజ, దంపతుల పూజలు, కుంకుమార్చనలు, ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజ, మంత్రపుష్పం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాలాత్రిపురసుందరీదేవికి వాహన సేవలు

3వ తేదీ గురువారం బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో పల్లకీసేవ, రాత్రి పద్మవాహన సేవ చేస్తారు. 4న బ్రహ్మచారిణి అలంకారంలో హంసవాహన సేవ, 5న చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్రవాహన సేవ, 6న కూష్మాండదుర్గ అలంకారంలో శేషవాహన సేవ, 7న స్కందమాత అలంకారంలో మయూరవాహన సేవ, 8న కాత్యాయని అలంకారంలో సింహవాహన సేవ, 9న మూలా నక్షత్రం రోజున కాళరాత్రి అలంకారంలో గజవాహన సేవ, 10న దుర్గాష్టమి రోజున మహాదుర్గ అలంకారంలో నందివాహన సేవ, మహర్నవమి రోజున సిద్ధిదాయని అలంకారంలో అశ్వవాహన సేవ, విజయ దశమి రోజున రాజరాజేశ్వరి అలంకారంలో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

నేటి నుంచి త్రిపురాంతకంలో చండీ యాగం

మార్కాపురం టౌన్: హైదరాబాద్‌కు చెందిన మహాకామేశ్వరీ పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి ఆనంద నిలయంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకూ మహావిద్య వనదుర్గా చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ వరుఘల శారదా శాయిరామశర్మ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన వివరాలు తెలిపారు. పదేళ్లుగా దసరా నవరాత్రుల్లో అమ్మవారి ఆలయంలో చండీయాగాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ ఉదయం 7.30 గంటల నుంచి హోమం ప్రారంభమవుతుందని తెలిపారు. హోమ పూజల్లో పాల్గొనే వారు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ తాళ్లపల్లి ప్రసాద్, జీవీఎల్ రమేష్‌బాబు పాల్గొన్నారు. మార్కాపురం పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా మెయిన్ బజారు మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు.